క్లుప్తంగా

అభివృద్ధి పనులపై సమీక్ష

ఏలూరు రూరల్: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల వేగవంతం ఏర్పాటుచేయాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక చొరవ వల్ల అధికారులు పైడిచింతపాడు, చాటపర్రు, జాలిపూడి జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మెరక పనులు పూర్తి చేశారని చెప్పారు. విద్యుత్, రోడ్లు, నీటి సౌకర్యం కల్పించడం వల్ల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. శ్రీపర్రు, మాదేపల్లి, మొండికోడు, మానూరు, మహేశ్వరపురం జగనన్న కాలనీల్లో మెరక చేసిన స్థలాలు ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ లక్ష్మణ్, సర్పంచ్ తెనాలి యోహాన్, వైఎస్సార్ సీపీ నేత ప్రకాష్ తదితరులు ఉన్నారు.

చెన్నైలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏలూరు రూరల్ : ఈ నెల 26 నుంచి 30 తేదీ వరకు చెన్నైలో ఖేలో ఇండియా నేషనల్ యూత్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు, 26వ తేదీ నుంచి 29 వరకు చండీగఢ్‌లో అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకట్రామయ్య కె.సర్వేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. యూత్ పోటీలకు ఎ.అరుణేష్ బాబు, డి.ప్రేమ్‌సాగర్, ఆర్ భవాని, ఎ.రేవతి, విశ్వ విద్యాలయాల పోటీలకు టి.మధుబాబు, ఇ.కోటేశ్వరరావు, టి.కుమార్‌స్వామి, ఎ.కోమలాకార్తీక్, ఎన్‌వీ సత్యనారాయణ, బి.ప్రశాంత్, డి.మౌలాలి మొత్తంగా 11 మంది లిఫ్టర్లు పాల్గొంటారని వివరించారు. ఈ జట్లుకు కోచ్‌లుగా ఎం రమేష్‌బాబు, ఎ.శ్రీనివాసరావు, వి.సందీప్, మేనేజర్లగా టి.దీన్షబాబు, టీటీపీఎల్ శ్రీకర్ వ్యవహరిస్తారని తెలిపారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన కలెక్టర్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించిన జాబితాను ప్రతి తహసీల్దార్ కార్యాలయం, సచివాలయాలు, పోలింగ్ బూత్‌ల్లో ఉంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ఆ కార్యక్రమ అనంతరం జీలుగుమిల్లి హైస్కూల్ ప్లస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ 70ను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది లేనిదీ చూసుకోవాలన్నారు.

డిజిటల్ బోధనా విధానంపై ఆరా

పాఠశాలలో డిజిటల్ బోధనా విధానంపై విద్యార్థులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం, అలాగే డిజిటల్ కంప్యూటర్ విద్యాబోధన తదితర అంశాలను, రిజిస్టర్‌లను పరిశీలించారు. తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లెక్క తేలింది

- ఏలూరు అసెంబ్లీ ఓటర్లు 2,30,724
- పెరిగిన ఓటర్లు 7,280
- పురుషులు 1,10,254
- స్త్రీలు 1,20,423
- థర్డ్ జెండర్స్ 47 మంది

ఏలూరు రూరల్ : ఏలూరు అసెంబ్లీ ఓటర్ల సంఖ్య 2,30,724గా లెక్క తేల్చారు. ఇందులో మహిళా ఓటర్లు 1,20,423, పురుష ఓటర్లు 1,10,254 ఉన్నారు. పురుషుల కంటే స్త్రీల ఓట్లు 10,169 అధికంగా ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల నాటి ఓటర్ల సంఖ్య కంటే నేడు 7,280 ఓటర్లు పెరిగారు. ఇందులో 18 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయసు గల యువ ఓటర్ల సంఖ్య 1,671 మంది. గత జాబితాలో 41 మంది థర్డ్ జెండర్స్ ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 47కి పెరిగింది. తుది జాబితా వెల్లడించే నాటికి చనిపోయిన 1,158 మంది ఓట్లు తొలిగించారు. ఈ వివరాలను ఏలూరు నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ నెల 22న నిర్వహించిన సమావేశంలో అధికారులు వెల్లడించారు.

ప్రత్యేక డ్రైవ్

ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారులు గతేడాది అక్టోబర్ 27 నుంచి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ చేపట్టిన సంగతి తెలిసిందే. 212 పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు అధికారులను (బీఎల్‌ఓ) నియమించారు. ప్రజల నుంచి 41,837 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో 11,239 ఫారం–6, (కొత్త ఓట్లు), 11,069 ఫారం–7 (తొలిగింపులు), 10,280 ఫారం–8 (మార్పు, చేర్పులు) దరఖాస్తులు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. ఒకే డోర్ నెంబర్‌తో 10 మందికి మించి ఓట్లు నమోదు కోసం 8,997 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరో 252 దరఖాస్తులు తప్పుడు డోర్ నెంబర్ కలిగి ఉన్నాయి. సరైన ఆధారాల్లేని దరఖాస్తులను తిరస్కరించగా, మిగిలినవి బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించారని అధికారులు తెలిపారు.



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల తుది జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ సోమశేఖర్



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ సుబ్బారావు (ఫైల్)

పోలింగ్ కేంద్రాలు సిద్ధం



ఏలూరు నియోజకవర్గ ఓటరు నమోదు ముఖ్యఅధికారి, జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు పర్యవేక్షణలో సుమారు మూడు నెలల పాటు నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించాం. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తుది జాబితా విడుదల చేశాం. జాబితా బీఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉంది. రానున్న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు కొత్త ఓటు లేదా మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల కోసం పోలింగ్ బూత్‌లు సిద్ధం చేశాం.

– బి.సోమశేఖర్, ఏలూరు అసెంబ్లీ సహాయ ఓటరు నమోదు అధికారి

మత్తు పదార్థాల జోలికెళ్లవద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మత్తు పదార్థాల జోలికెళ్లవద్దని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు సూచించారు. నవ జీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తూర్పువీధి శ్రీకృష్ణదేవరాయ నగర పాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కృంగిపోతారని, క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. నవ జీవన్ జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలు కోల్పోతామని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు సీహెచ్ హరిబాబు మాట్లాడారు. నవ జీవన్ జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్ జాకబ్‌రాజు, బి.నేహెమ్యా, వి.జయాపాల్, పాఠశాల అధ్యాపకులు డీడీ శ్రీనివాసరావు, వి.సీతారాముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళా నైపుణ్యం కూడా పెంపొందించుకోవాలి

ఏలూరు (టూటౌన్): కంప్యూటర్ శిక్షణతో పాటు ఏదో ఒక కళా నైపుణ్యం పెంపొందించుకోవాలని అక్షరం ఆర్ట్స్ కార్యదర్శి డి.రాములు సూచించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం 27వ బ్యాచ్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ మైనేని లక్ష్మి స్వాగతం పలికగా, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సెట్‌వెల్ గుర్తింపుతో ఏవీఆర్ విజ్ఞానకేంద్రం నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రం అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. అభినయ నృత్య భారతి ప్రధాన కార్యదర్శి డి.హేమసుందర్ మాట్లాడుతూ ఏలూరులో వివిధ రంగాల కళాకారులు అభివృద్ధి కావడం అవసరమన్నారు. వివిధ కంప్యూటర్ కోర్సుల్లో ఇప్పటి వరకూ 27 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టి.ఆంజనేయులు, ఎస్ కస్తూరిరావు, వి.సురేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 28 మందికి సర్టిఫికెట్లను అందజేశారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

వామపక్ష పార్టీల నిరసన

ఏలూరు (టూటౌన్): గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రలకు ప్రపంచ తత్వవేత్త కారల్ మార్క్స్, సోషలిస్ట్ విప్లవ నేత లెనిన్ పేర్లు పెట్టడాన్ని నిరసిస్తూ స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్‌వీసీ ఐమాక్స్ థియేటర్ వద్ద వామపక్ష పార్టీలు బుధవారం నిరసన వ్యక్తం చేశాయి. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రెటరీ బండి వెంకటేశ్వరరావు, సీపీఎం ఏలూలరు నగర కార్యదర్శి పి.కిషోర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావులు అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా సోషలిస్టు సమాజం ఏర్పాటు చేయవచ్చని మార్క్సిస్టు సిద్ధాంతాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి కార్ల్ మార్క్స్, మొట్టమొదటగా రష్యాలో సోషలిస్టు సమసమాజాన్ని స్థాపించిన వ్యక్తి కామ్రేడ్ లెనిన్ మహానీయుల పేర్లు గుంటూరు కారం సినిమాలో తొలగించాలని డిమాండ్ చేశారు.

నేడు ఓటర్ల దినోత్సవం

ఏలూరు (మెట్రో): ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల ప్రదానం చేస్తారని, సీనియర్ ఓటర్లకు, విభిన్న ప్రతిభావంతుల ఓటర్లను సన్మానిస్తారని పేర్కొన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం, ఓటు హక్కు ప్రాముఖ్యతపై విద్యార్థులు ప్రసంగం ఉంటుందని తెలిపారు.

దిశ యాప్‌తో మహిళలకు భరోసా



బాల్యం - న్యాయం పుస్తకం ఆవిష్కరించిన అతిథులు



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దిశ యాప్‌ను ఫోన్లలో ఉంటే పోలీసులు తమ వెంటే ఉన్నారని భరోసా మహిళలకు కలుగుతుందని ఏలూరు దిశా పోలీస్ స్టేషన్ మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ కాంతి ప్రియ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సుబ్బమ్మ దేవి స్కూల్‌లో బుధవారం వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంతి ప్రియ మాట్లాడుతూ మహిళా చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశాలపై అవగాహన కలిగించారు. ఆపద సమయాల్లో దిశా యాప్‌ను ఉపయోగిస్తే 10 నిమిషాల్లో బాధితులకు పోలీసులు సహాయం అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బాల్యం న్యాయం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సీహెచ్ సూర్య చక్రవేణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల పట్ల చిన్నచూపు తగదు

బాలికల పట్ల చిన్నచూపు తగదని, బాలికల చదువు ఇంటికి వెలుగని, అభివృద్ధి సూచిక అని బాల వికాస్ భారతి అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ అన్నారు. జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, బాల వికాస్ భారతి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక 35వ డివిజన్‌లోని వీరమాచనేని విమలాదేవి నగర పాలక పాఠశాలలో ఆడపిల్లలు – అభివృద్ధి సూచిక అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సుకు కట్టా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యవక్త మానవత సంస్థ సభ్యులు వల్లూరుపల్లి సుధ మాట్లాడుతూ కుటుంబంలో బాలికల అభివృద్ధికి, వారి చైతన్యం కోసం తగిన కృషి చేయాలన్నారు. సదస్సులో మానవత సంస్థ సభ్యురాలు ఆలూరి మోహిని, పరిసర ప్రాంత మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కార్మికులకు సూచించారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్ వద్ద భవన నిర్మాణ రంగ కార్మికులకు చట్టాలపై బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో రత్నప్రసాద్ మాట్లాడారు. పథకాలు పొందటంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పథకాలు పొందటం కోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడూ ఈశ్రాం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. దీంతో సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్ పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, కట్టా సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

మొండికోడులో జెంబో షెడ్డు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం మొండికోడులో సుమారు రూ.10 లక్షలు మండల పరిషత్ నిధులు వెచ్చించి జెంబో షెడ్డు నిర్మించారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాలతో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు పరివేక్షణలో ఇంజినీరింగ్ అధికారులు షెడ్డు పనులు పూర్తిచేశారు. స్థానిక శ్రీసంతోషిమాత ఆలయం వద్ద నిర్మించిన ఈ షెడ్డు ప్రజలతో పాటు భక్తులకు సైతం సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ.కోట్లు వెచ్చించి సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల మరమ్మతులు, పేదలకు ఇళ్ల స్థలాలు, మెరక పనులు, తాగునీటి పైప్‌లైన్ తదితర అభివృద్ధి పనులు పూర్తిచేశామని సర్పంచ్ వేజెళ్ల గోపాలకృష్ణంరాజు బుధవారం ఆనందం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్టు తెలిపారు.



మెండికోడులో నిర్మించిన జెంబో షెడ్డు

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు



తుది అంకానికి చేరిన బ్యాడ్మింటన్ జట్లు



బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న పురుషుల జట్లు

ఏలూరు రూరల్: ఏలూరు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో, శనివారపుపేట దత్తాశ్రమం వద్ద ఇండోర్ గ్రౌండ్‌లో బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. సచివాలయ స్థాయి జోన్ పోటీల్లో విజయం సాధించిన జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం ఇందిర పరివేక్షణలో బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో తంగెళ్లమూడి సచివాలయం–1 జట్టుపై రామచంద్రరావుపేట విజయం సాధించి, తుది అంకానికి చేరింది. ఫైనల్‌లో శేఖర్‌వీధి సచివాలయం జట్టుతో తలపడనుంది. మహిళల బ్యాడ్మింటన్ విభాగంలో గొల్లాయిగూడెం సచివాలయం–2 జట్టుపై వెంకటాపురం జట్టు విజయం సాధించింది. ఫైనల్స్‌లో వెంకటాపురం సచివాలయం జట్టు శేఖర్‌వీధి సచివాలయ జట్టుతో తలపడనుంది.

నేటి నుంచి ఏఎస్ఆర్‌లో పోటీలు

ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో గురువారం ఉదయం నుంచి కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. జోన్ స్థాయిలో విజయం సాధించిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయి. ఈ పోటీల్లో విజేత జట్టుకు రూ.35 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానం జట్టుకు రూ.5 వేలు అందించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయికి చేరుకుంటాయని జిల్లా క్రీడాధికారులు వెల్లడించారు.

రాజ్యాంగ అంశాలపై ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్‌కు హాజరైన విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాజ్యాంగ ప్రవేశిక ముఖ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని 35వ డివిజన్ వెంకట్రావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆర్ఆర్‌పేటలోని ఈదర సుబ్బమ్మ దేవి పాఠశాలలో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ బలే సురేష్ రిపబ్లిక్ డేని పురస్కరించుకొని ఈ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. మేతర అజయ్ బాబు మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమాల్లో కె.మిషక్, బి.కృష్ణ, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులపై బ్లడ్ గ్రూప్ ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వాహనచోదకుల గుర్తింపు కార్డులపై తప్పనిసరిగా తమ బ్లడ్ గ్రూప్ ఉండేలా జాగ్రత్త వహించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలు విధిగా పాటించడం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోగలరని తెలిపారు. పలువురు మాట్లాడుతూ రహదారి నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అజ్మీరా బద్దు, రోడ్డు భద్రతా ఎస్సై బి.శ్రీనివాసు, రోడ్డు భద్రత వైద్యురాలు మౌనిక పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

వైఎస్సార్ సీపీ హయాంలోనే పేదలకు ఇళ్లు

ఉంగుటూరు: పేదల ఇళ్ల సాకారం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. తహసీల్దారు వెంకటరమణ ఆధ్వర్యంలో ఉంగుటూరులో 16 మందికి, నాచుగుంటలో ఏడుగురికి, నల్లమాడులో ఒకరికి, నీలాద్రిపురంలో ఒకరికి, ఉప్పాకపాడులో ఐదుగురికి, కంసాలిగుంటలో ఇద్దరికి, వీఏ పురంలో ఏడుగురికి పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సచివాలయాల కన్వీనర్ పెనుగండ బాలకృష్ణ, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, మహిళా నాయకురాలు మంద జయలక్ష్మి పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై మాక్ డ్రిల్

పెదవేగి: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, సిబ్బంది ప్రమాదాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఖాజావలీ సూచించారు. పెదవేగి మండలం నడిపల్లిలోని ప్రసాద్ సీడ్స్ కర్మాగారంలో బుధవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు, రవాణా, ఆరోగ్య, పరిశ్రమ శాఖల సంయుక్త ఆధ్వర్యాన మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎల్పీజీ గ్యాస్ లీకేజీల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులు స్పందించాల్సిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా పరిశ్రమల శాఖ ఉప ముఖ్యఅధికారి ఆర్.త్రినాధరావు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ కృష్ణవతారం వివరించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ, పర్యావరణశాఖ ఈఈ కె.వెంకటేశ్వరరావు, నడిపల్లి సర్పంచ్ మేకా అప్పాయమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	34
వంకాయలు (కాంతులు)	20	బీన్లచిక్కుడు	40
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	60
బెండకాయలు	54	ములక్కాడలు	10–12
పచ్చిమిర్చి	42	కంద	60
కాకర కాయలు	48	బీట్‌రూట్	34
బీరకాయలు	54	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	64	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	30	అల్లం	120
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	26–30	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	08
దోసకాయలు	30–36	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	13
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	4822	23
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	27